సాక్షి
పార్వతీపురం మన్యం

శనివారం। 9। సెప్టెంబర్। 2023



శతశాతం జీఈఆర్ నమోదే లక్ష్యం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యార్థుల చదువుకు అధిక ప్రాధాన్యమిస్తోంది. శతశాతం జీఈఆర్ నమోదే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. - 8లో



సీతానగరంలో 'జగనన్నకు చెబుదాం'

సీతానగరం ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. - 8లో



ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలి

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరింపజేయాలని ఏపీ ప్రకృతి వ్యవసాయం ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి. విజయ్‌కుమార్ కోరారు. - 8లో

న్యూస్‌రీల్

జగనన్నకు చెబుదాం షెడ్యూల్ విడుదల

పార్వతీపురం: మండల స్థాయిలో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమం షెడ్యూల్‌ను కలెక్టర్ నిశాంత్‌కుమార్ శుక్రవారం విడుదల చేశారు. ఈ మేరకు సెప్టెంబర్ 13న పార్వతీపురం, 15న బలిజిపేట, 20న కొమరాడ, 22న మక్కువ, 27న గరుగుబిల్లి, 29న పాలకొండ, అక్టోబర్ 4న జియ్యమ్మవలస, 6న వీరఘట్టం, 11న కురుపాం, 13న సీతంపేట, 18న సాలూరు, 20న పాచిపెంట, 25న భామిని, 27న గుమ్మలక్ష్మీపురం మండలాల్లో జరుగుతుందని ఆయన ప్రకటించారు. మండల స్థాయిలో నిర్వహించనున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జిల్లా అధికారులందరూ పాల్గొంటారన్నారు. ప్రజలు అందించిన అర్జీలను జగనన్నకు చెబుదాం పోర్టల్‌లో నమోదు చేస్తామని తెలిపారు.

ఉత్తమ పంచాయతీ సర్పంచ్‌కు సత్కారం



సర్పంచ్ సింహాచలంను సత్కరిస్తున్న ఐసీడీఎస్ పీడీ, సిబ్బంది

సీతానగరం: పచ్చదనం పరిశుభ్రతలో జోగింపేట పంచాయతీ జాతీయస్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎంపికైన సంగతి తెలిసిందే. అవార్డు వచ్చేందుకు కృషిచేసిన సర్పంచ్ కె.సంహాచలంను ఐసీడీఎస్ సీడీపీఓ సుగుణ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, సిబ్బంది శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు.

రావివలసలో పులి పంజా

- కోడెదూడను హతమార్చిన బెబ్బులి



రావివలసలో పులిదాడిలో చనిపోయిన కోడెదూడను పరిశీలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

బాడంగి: విజయనగరం జిల్లా బాడంగి మండలం రావివలస గ్రామంలోని కొల్లి నారాయణమ్మ పశువుల శాలపై గురువారం అర్ధరాత్రి పులి పంజా విసిరింది. కోడెదూడను సమీపంలోని తోటల్లోకి లాక్కుపోయి పీక కొరికి హతమార్చింది. గతేడాది కూడా ఇదే గ్రామంలోని తోటలోని పశువులపై దాడిచేసి ఆవును పొట్టన పెట్టుకుంది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు శ్రీనివాసరావు, స్వప్న, కిరణ్, ఏబీఓ మంగమ్మ, ఎస్ఐ ఆర్.జయంతి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పాదముద్రలను పరిశీలించి పులివిగా నిర్ధారించారు. రావివలస, పరిసర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు.

జెమ్స్‌లో ఫిజియోథెరపీ దినోత్సవం



ఫిజియోథెరపీ సదస్సులో సదస్సులో పాల్గొన్న జెమ్స్ సిబ్బంది

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో శుక్రవారం ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎంఈ, ప్రోగ్రాం, విద్యార్థులకు సైంటిఫిక్ పోస్టర్ పోటీలు జరిగాయి. అనంతరం ఇన్‌ఫ్లామెటరీ, ఆర్థరైటిస్, రుమాటాయిడ్ ఆర్థరైటిస్‌పై అవగాహన సదస్సు జరిగింది. జెమ్స్ ఆస్పత్రిలో నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని, ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాహుల్ తెలిపారు.


పోటెత్తిన బండిగెడ్డ

రేగిడి: గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు రేడిగి మండలంలోని బండిగెడ్డ, ఆకులలోవ కట్టగెడ్డలకు వరదనీరు పోటెత్తింది. రేగిడికి వెళ్లే రోడ్డుపై నుంచి నీరు ప్రవహించడంతో పాటు, లింగాలవలస, అంబఖండి, వన్నలి, ఉప్పర్నాయుడువలస, అక్కన్నఅగ్రహారం తదితర గ్రామాల్లోని పంట పొలాలు ముంపునకు గురయ్యాయి.

శ్రావణ లక్ష్మికి.. సిరి పూజలు



పాలకొండ: కోటదుర్గమ్మ సన్నిధిలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



పాలకొండ: బంగారు ఆభరణాల అలంకరణలో కోటదుర్గమ్మవారు



ప్రత్యేక గాజులు, పూల అలంకరణలో విజయనగరం పైడితల్లి



పూజలందుకుంటున్న పోలమాంబ అమ్మవారు

సిరులిచ్చే తల్లి.. శ్రావణలక్ష్మికి ప్రీతికరమైన శ్రావణ శుక్రవారం మహిళలు భక్తి శ్రద్ధలతో సిరి పూజలు జరిపారు. పసుపు కుంకుమలు సమర్పించారు. వివిధ అలంకరణలలో దర్శనమిచ్చిన అమ్మవార్లకు నైవేద్యాలను సమర్పించారు. సామూహిక వరలక్ష్మి వ్రతాలు జరిపారు. ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి, మక్కువ మండలం శంబరలోని పోలమాంబ, పాలకొండలోని కోటదురమ్మ అమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. అమ్మవార్లను దర్శించి తరించారు.

– పాలకొండ/మక్కువ/విజయనగరం టౌన్



మక్కువ: శంబరపోలమాంబ అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

కోడూరుమాత యాత్రకు వేళాయె..



ప్రార్థనల కోసం ఏర్పాటుచేసిన టెంట్లు

బాడంగి: మండలంలోని కోడూరులో వెలసిన కోడూరు మాత యాత్రకు వేళయింది. ఫాదర్ యుగల్ కుమార్ పర్యవేక్షణలో శనివారం జరిగే పూజలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గుహలోని మరియ మాతను భక్తులు క్యూలో వెళ్లి దర్శించుకునేలా బారికేడ్లు ఏర్పాటుచేశారు. భక్తుల ప్రార్థనకు అనువుగా టెంట్లు వేశారు. బాడంగి-పిన్నవలస కూడలి నుంచి కోడూరు పుణ్యక్షేత్రానికి చేరుకునే వరకు రోడ్డును బాగుచేశారు. వాహనాల నిలిపేందుకు పార్కింగ్ ప్రదేశాలు సిద్ధంచేశారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలపైన వచ్చిన భక్తులను దాదాపు కిలోమీటరు దూరంలో దించేసి, వన్‌వే ట్రాఫిక్ ద్వారా రామచంద్రాపురం రోడ్డు వైపుగా మళ్లించేందుకు చర్యలు చేపట్టారు. యాత్ర ఏర్పాట్లను సీఐ తిరుమలరావు, ఎస్ఐ జయంతి శుక్రవారం పర్య వేక్షించారు. సిబ్బందికి సూచనలిచ్చారు.

కాపు మహిళలకు ఆర్థిక నేస్తం



- ఏడాదికి రూ.15 వేలు ఆర్థిక సాయం
- ఈ నెలలో విడుదల కానున్న నాలుగో విడత నిధులు
- జిల్లాకు గత మూడు విడతల్లో రూ.6.20 కోట్లు
- నాల్గో విడత కింద జిల్లాకు రూ.రూ.2.28 కోట్లు
- 'పారదర్శకంగా అర్హుల ఎంపిక

జిల్లాలో కాపు నేస్తం లబ్ధిదారులు ఇలా...		
సంవత్సరం	లబ్ధిదారులు	అందిన మొత్తం (రూ.కోట్లలో)
2020-2021	1362	2.043
2021-2022	1344	2.016
2022-2023	1429	2.144

పార్వతీపురంటౌన్: సంక్షేమం.. అభివృద్ధికి సమానమైన ప్రాధాన్యమిస్తూ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ అమలు చేస్తున్న పథకాలు అన్ని వర్గాలకూ ఆపన్న హస్తాన్ని అందిస్తున్నాయి. ఆర్థికంగా, సామాజికంగా చితికిపోయిన కుటుంబాలకు చేయూతనందిస్తున్నాయి. ఈ క్రమంలోనే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ కాపునేస్తం పథకం కాపు, బలిజ, తెలగ, ఒంటరి, ఉప కులాల మహిళల జీవన ప్రమాణాలను పెంచుతోంది. మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతోంది. గత మూడు విడతల్లో పథకం కింద పార్వతీపురం మన్యం జిల్లాలో 4,135 మంది లబ్ధిపొందారు. తాజాగా నాలుగో విడతల నిధుల విడుదలకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తిచేసింది.

ఇప్పటివరకు రూ.6.20 కోట్ల లబ్ధి..

వైఎస్సార్ కాపునేస్తం పథకానికి గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ.10వేల లోపు, పట్టణ పరిధిలో రూ.12వేల లోపు ఆదాయం ఉన్న 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న మహిళలు అర్హులు. ఏటా రూ.15 వేల నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి ప్రభుత్వం జమ చేస్తోంది. ఈ లెక్కన అర్హులైన లబ్ధిదారులకు ఐదేళ్లలో రూ.75 వేల లబ్ధి చేకూరనుంది. జిల్లాలో ఇప్పటి వరకూ మూడు విడతల్లో 4,135 మంది ఖాతాల్లోకి రూ. 6.20 కోట్లు జమ కాగా, ఈ నెలలో నాల్గో విడత కాపునేస్తం నిధులు విడుదలకు జగన్‌మోమన్‌రెడ్డి సర్కారు ఏర్పాట్లు చేస్తోంది. ఇది వరకే పథకం అందుకుంటున్న లబ్ధిదారులు రెన్యువల్ చేసుకోగా కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారితో కలిపి 5,655 మందికి లబ్ధి చేకూరనుంది.

గతంలో ఎవరూ గుర్తించలేదు



గతంలో ఏ ప్రభుత్వమూ మా కష్టాలను గుర్తించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కాపు నేస్తం కింద ఏటా రూ.15 వేలు అందుతోంది. ఈ డబ్బుతో చిన్నపాటి వ్యాపారం చేసుకుని కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగు పరుచుకున్నాం. జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

–పుంద్రోతు లక్ష్మి, తెలగ, పార్వతీపురం పట్టణం

ఆర్థికంగా ముందుకు



కాపు కులాల్లో ఉన్న పేదలను గుర్తించి ఏటా కాపు నేస్తం కింద రూ.15 వేలు ఆర్థిక సాయం అందించడం గొప్ప విషయం. ఈ డబ్బు మా కుటుంబాల ఆర్థిక ఎదుగుదలకు దోహదపడ్డాయి. ఇచ్చిన మాట నెరవేర్చుకుంటూ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఒక్కరే అన్ని వర్గాలకు అండగా నిలిచారు.

– చిక్కాల ఉమ, తెలగ, పార్వతీపురం పట్టణం

అర్హులందరికీ వర్తింపు



ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కాపు నేస్తం కింద ఆర్థిక సాయం అందజేస్తున్నాం. గతంలో లబ్ధి పొందిన వారికి రెన్యువల్ చేయడంతో పాటు కొత్తగా వచ్చిన దరఖాస్తులను పరిశీలన చేసి అర్హులను ఎంపిక చేశాం. ఈ నెలలోనే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి ప్రభుత్వం నగదు జమ చేయనుంది.

– ఆర్. గడ్డెమ్మ, ఈడీ ,బీసీ కార్పొరేషన్, పార్వతీపురం మన్యం

పట్టా వచ్చె.. సంతోషం తెచ్చె..



పోడు పట్టాలు పొందిన గిరిజన లబ్ధిదారులతో డిప్యూటీసీఎం రాజన్నదొర, మావుడి సోదరులు

- నెరవేరిన మూడు దశాబ్దాల కల
- 60 మంది గిరిజన రైతులకు పోడుపట్టాలు
- పట్టాలు చూసి మురిసిపోయిన గిరిజనులు
- గిరిజనుల పేర్లు పిలిచి పట్టాలు అందజేసిన డిప్యూటీ సీఎం రాజన్నదొర

మక్కువ: ఏడాది కాదు.. రెండేళ్లు కాదు... 35 ఏళ్ల నుంచి పోడు పట్టాల కోసం ఆ గిరిజన రైతులు ఎదురు చూస్తున్నారు. అవకాశం వచ్చినప్పుడల్లా అధికారులు, పాలకులకు వినతులు అందజేశారు. సమస్యను తెలియజేశారు. దీనిని గుర్తించిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పోడుపట్టాలు అందజేసేందుకు నడుంబిగించింది. పట్టాలు సిద్ధం చేసింది. డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర నేరుగా శుక్రవారం ఆ గ్రామానికి వెళ్లి.. గిరిజన రైతుల పేర్లు పిలిచి పోడుపట్టాలు అందజేయడంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. పట్టాలను పదేపదే చూసుకుని మురిసిపోయారు. ఈ సంతోష సంబరాలకు మక్కువ మండలంలోని నంద గ్రామం వేదికైంది. గ్రామంలో సుమారు 113 గిరిజన కుటుంబాలు ఉన్నాయి. వీరిలో 60 గిరిజన కుటుంబాలకు తొలివిడతగా పోడుపట్టాలను రాజన్నదొర చేతుల మీదుగా అందజేశారు.

ఈ సందర్భంగా గిరిజన రైతులు మాట్లాడుతూ ఇంతవరకు మేము సాగుచేసే భూములకు ఎలాంటి హక్కులు లేవని, ఇన్నాళ్లకు పట్టాలు వచ్చాయని, ప్రభుత్వ పథకాలు, రాయితీలు అందుతాయంటూ సంతోషపడ్డారు. పోడు పట్టాలందించి, మా కుటుంబాలకు ఆసరాగా నిలిచిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం రాజన్నదొరకు, జెడ్పీటీసీ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రబాబుకు ఓటమి భయం

- రాష్ట్రాన్ని రావణ కాష్టంగా మార్చేయత్నం
- రౌడీ మూకలను రెచ్చగొడతున్న వైనం
- చంద్రబాబు, లోకేశ్‌ల తీరును దుయ్యబట్టిన డిప్యూటీసీఎం రాజన్నదొర



మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు ఓటమి భయం పట్టుకుందని, రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చేసి అధికారాన్ని చేజిక్కించుకునే యత్నాలు ప్రారంభించారని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర విమర్శించారు. ఈ కోవలోనే పుంగనూరులో చంద్రబాబు కనుసన్నల్లోను, భీమవరంలో లోకేశ్ ప్రోద్బలంతో దాడులు జరిగాయని ఆరోపించారు. సాలూరు పట్టణంలోని తన గృహంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీకి ఓటమి భాయమని స్పష్టం కావడంతో రాజకీయ ఉనికి కోసం ఆరాట పడుతూ, రౌడీమూకలతో సామాన్య ప్రజలు, పోలీసుల మీద చంద్రబాబు, లోకేశ్‌లు దాడిచేయిస్తున్నారని ఆరోపించారు. విధుల్లో ఉన్న పోలీసుల కళ్లు, కాళ్లు విరగ్గొట్టేలా దాడులకు ఉసుగొల్పుతున్నారన్నారు. చంద్రబాబు, లోకేశ్‌ల అరాచకాలను పవన్‌కళ్యాణ్, పురందరేశ్వరి, సీపీఐ, సీపీఎమ్ పార్టీలు ఖండిచకపోవడం విచారకరమన్నారు. నాడు ప్రతిపక్షనేతగా జగన్మోహన్‌రెడ్డి చేసిన సుదీర్ఘ ప్రజాసంకల్పయాత్రలో ఏ రోజు ఏ ప్రాంతంలోనూ సమస్య తలెత్తలేదన్నారు. టీడీపీ కుట్రలను గిరిజన ప్రజాప్రతినిధులు, నాయకులు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారని, గిరిజనుల్లో చిచ్చుపెట్టే ప్రయత్నాలు చేసిన దారునాయక్ వంటి వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. తక్షణమే పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి రాష్ట్రంలో దాడులకు పాల్పడుతున్న, అరాచకాలు సృష్టిస్తున్న చంద్రబాబు, లోకేశ్, టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్టీసీ ఆదాయాన్ని పెంచుదాం

- డిప్యూటీ సీటీఎం అప్పలనాయుడు



డిపోలో సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ సీటీఎం అప్పలనాయుడు

పాలకొండ రూరల్: ఆర్టీసీ ఆదాయాన్ని మరింత పెంచేలా సమష్టిగా పనిచేద్దామని సంస్థ డిప్యూటీటీ సీటీఎం బి.అప్పలనాయుడు సిబ్బందికి పిలుపునిచ్చారు. పాలకొండ డిపోతో పాటు కాంప్లెక్స్‌ను శుక్రవారం సందర్శించారు. డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ సిబ్బందితో మాట్లాడారు. సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్గో ద్వారా ఆదాయం పెంచాలన్నారు. బస్సుల నిర్వహణపై బాధ్యత అవసరమన్నారు. చేయిఎత్తిన చోట బస్సు ఆపి ప్రయాణికులను ఎక్కించాల న్నారు. లింకు బస్సు సర్వీసుల షెడ్యూల్, ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించడం, సమయపాలన వంటి అంశాలపై దృష్టిపెట్టాలన్నారు. డిపో మేనేజర్ పి.వెంటేశ్వరరావు మాట్లాడుతూ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల వస్తువులు భద్రపర్చేందు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన వెంట ఎస్.లక్ష్మణరావు, ఎం.కె.రాజు, బి.రాంబాబు, ఎస్టీఐ ఆర్.వెంకటేశ్వరరావు, దివ్య ఉన్నారు.

చంద్రబాబు బండారం బట్టబయలు

- ఐటీ శాఖ నోటీసులతో ప్రతిపక్ష నేత ఉక్కిరిబిక్కిరి
- టిడ్కో ఇళ్లతో పాటు తాత్కాలిక సచివాలయం నిర్మాణంలో అవినీతి
- నోటీసుల జారీపై ఎల్లో మీడియా ఎందుకు స్పందించడం లేదు...?
- చంద్రబాబు సభలకు, లోకేశ్ పాదయాత్రలకు స్పందన కరువు
- రౌడీ మూకలతో అల్లర్లు సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తోన్న టీడీపీ
- మీడియాతో మాట్లాడిన వైఎస్సార్‌సీపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్న సమయంలో జరిగిన అవినీతిపై ఐటీ శాఖ నోటీసులు జారీ చేయడంతో అసలు బండారం బట్టబయలైందని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తికి ఐటీశాఖ నోటీసులు జారీ చేస్తే ఇన్‌కమ్ ట్యాక్స్ యాక్ట్ ప్రకారం ఎందుకు బదులివ్వలేకపోతున్నారని నిలదీశారు. ఇదే విషయంలో చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులు, ఆడిటర్‌లు, పార్టీ వ్యక్తులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రజాజీవితంలో ఉన్న వారు కచ్చితంగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. షాపూర్ పల్లంజి కంపెనీ, టిడ్కో ఇళ్ల నిర్మాణంలో చంద్రబాబుకు అవినీతి సొమ్ము కోడ్ భాషలో రూ.వందల కోట్లు ముట్టిందన్నారు. ప్రతి సభలో అవతల వ్యక్తులపై నిరాధారమైన ఆరోపణలు చేసే చంద్రబాబు తన నిజాయితీని నిరూపించుకోవాలన్నారు. పేదల ప్రజల కోసం నిర్మించాల్సిన టిడ్కో ఇళ్లకు కేటాయించిన డబ్బు పక్కదారి పట్టించారని ఆరోపించారు. తాత్కాలిక సచివాలయం నిర్మించిన షాపూర్ పల్లంజి సంస్థ నుంచి చంద్రబాబు పీఏ శ్రీనివాసరావు ద్వారా ముడుపులు అందినట్లు రుజువైందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలోనే టీడీపీ హయాంలో జరిగిన అవినీతిపై ఫిర్యాదులు చేసినట్లు గుర్తుచేశారు. వ్యవస్థలను మేనేజ్ చేస్తూ, అవినీతికి పాల్పడుతూ చంద్రబాబు అధికారంలోకి వచ్చారన్న విషయం రాష్ట్ర ప్రజలకు తెలియనది కాదన్నారు. గతంలో మాదిరి చంద్రబాబు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని, నేటి పోటీ ప్రపంచంలో ప్రజలందరూ అన్ని విషయాలూ తెలుసుకుని నిజనిర్ధారణ చేసుకుంటున్నారన్న విషయం టీడీపీ నేతలు గుర్తెరగాలన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యాఖ్యలు

ప్రజా సమస్యల పేరిట టీడీపీ అధినేత చంద్రబాబు నిర్వహిస్తున్న బహిరంగ సభలకు, లోకేశ్ చేపడుతున్న పాదయాత్రకు ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో రౌడీమూకలతో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని మజ్జి శ్రీనివాసరావు మండిపడ్డారు. పుంగనూరుతో పాటు భీమవరంలో జరిగిన ఘటనలే దీనికి నిదర్శనమన్నారు. టీడీపీ నేతలు సృష్టిస్తున్న అల్లర్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పోలీసులు క్షతగాత్రులవుతున్నారని వాపోయారు. దీనికి కారకులైన వారిపై చట్ట ప్రకారం శిక్ష తప్పదని హెచ్చరించారు.

క్లుప్తంగా

పోలీసుల సంక్షేమానికి కృషి



పోలీస్ సిబ్బంది నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: పోలీసుల సంక్షేమానికి తాము కృషిచేస్తున్నామని ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీస్ సంక్షేమ దివస్ నిర్వహించి సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. వారి వ్యక్తిగత, ఉద్యోగ సమస్యలను తెలుసుకుని, పరిష్కారానికి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ నెల 15వరకు ఎన్ఎంఎంఎస్‌కు దరఖాస్తు గడువు

పార్వతీపురం: నేషనల్ మీన్స్‌కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు సెప్టెంబర్ 15లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.డీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ నందు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం సెప్టెంబర్ 16లోగా పరీక్ష ఫీజును చెల్లించాలని, డిసెంబర్ 3న రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు తెలిపారు.

జి20 సదస్సు దేశానికి గర్వకారణం



జి20 సదస్సు నమూనాతో డీవీఎల్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

శృంగవరపుకోట: ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతి గాంచిన జి 20 శిఖరాగ్ర సదస్సు ఈ సారి భారత్‌లో జరగడం దేశానికి గర్వకారణం అని ఎస్.కోట పట్టణంలోని భవానీనగర్‌లో గల డీవీఎల్ స్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. పాఠశాల అధినేత డాక్టర్ వరలక్ష్మి సూచనల మేరకు జి20 సదస్సు లోగోను పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా జి20 శిఖ రాగ్ర సమావేశం ఆవశ్యకత, ప్రయోజనాలను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కండిపల్లి రమేష్, తదితర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు నిందితుల అరెస్టు



అరెస్టయిన నిందితులు

సీతంపేట: ఓ వ్యక్తి ఆత్మహత్యకు కారణమైన ఇద్దరు నిందితులను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సీతంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గత నెల 14న చిన్నబెత్తుపురం గ్రామానికి చెందిన సవర కిచ్చాయిని చిల్లంగి ఉందనే అనుమానంతో గ్రామస్తులు, కుటుంబసభ్యులు ముందు స్తంభానికి కట్టి కొట్టివేశారు. ఆ అవమానం భరించలేక కిచ్చాయి తన ఇంటి ముందు ఉన్న శాలలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసి అదే గ్రామానికి చెందిన సవర చిన్నారావు, అప్పన్నలను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నీల కంఠరావు తెలిపారు. ఇటువంటి నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380-00
బంగారం(22సి. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹154	₹278	₹ 288

శతశాతం జీఈఆర్ నమోదే లక్ష్యం

- విద్యార్థుల చదువకు పెద్దపీట
- చదువుకు దూరమైన వారిని తిరిగి పాఠశాలలు, కళాశాలల్లో చేర్పిస్తున్న అధికారులు
- ఆరు మండలాల్లో శతశాతం పూర్తి



విజయనగరం మండలం మలిచర్ల జెడ్పీహెచ్ స్కూల్‌లో చేర్పులు

విజయనగరం అర్బన్: 'విజయనగరం మండలం మలిచర్ల జెడ్పీహెచ్ స్కూల్‌లో పదోతరగతి ఫెయిల్ అయిన తొమ్మిది మంది విద్యార్థులు చదువు మానేసి ఇళ్ల వద్ద ఉన్నారు. వీరిని గుర్తించిన వలంటీర్లు పాఠశాలకు తీసుకెళ్లారు. ప్రభుత్వ నిబంధనల మేరకు తిరిగి పదో తరగతిలో చేర్పించేందుకు ప్రధానోపాధ్యాయురాలు జి.సుజాత ముందుకు వచ్చారు. వారు ససేమిరా అన్నారు. వారికి కౌన్సెలింగ్ చేసి చదువుపై అవగాహన కల్పించి మరలా పదోతరగతిలో చేర్పించారు.'

చదువకు ఏ ఒక్క విద్యార్థి దూరంకారాదన్నది ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం. ఇందులో భాగంగానే ఉత్తీర్ణులైనవారు, కానివారు కూడా చదువును మధ్యలో మానేయకుండా తిరిగి పాఠశాలలు, కళాశాలల్లో చేరే అవకాశం కల్పించింది. సచివాలయం వేదికగా విద్యార్థుల నమోదును చేపట్టింది. 2005 సెప్టెంబర్ 1 నుంచి 2008 ఆగస్టు 31 మధ్య జన్మించిన వారంతా సెప్టెంబర్ 4 నాటికి ఏదోఒక స్కూల్/కళాశాలలో నమోదై ఉండాలని ఆదేశాలు జారీ చేసింది. ఎవరైనా బడి/కళాశాలకు దూరంగా ఉంటే వారిని వెంటనే చేర్పించాలని వలంటీర్లు, గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, డీఈఓలకు సూచించింది. ఈ నేపథ్యంలో జూలై నెల నుంచి ఇంటింట సర్వే చేశారు. బడి/కళాశాలలకు వెళ్లని విద్యార్థులను గుర్తించారు. పదో తరగతిలోపు విద్యార్థులను వారి కోరుకున్న ప్రభుత్వ/ప్రైవేటు పాఠశాలలకు పంపారు. ఇంటర్ ఫెయిలైన వారు, మధ్యలో మానేసినవారిని కాలేజీ/ఐటీఐ/పాలిటెక్నిక్ కోర్సుల్లో చేర్చారు. జిల్లా యంత్రాంగం విద్యార్థుల స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్)లో శుక్రవారం నాటికి 95.24 శాతం లక్ష్యాన్ని సాధించింది. జిల్లాలోని విజయనగరం, కొత్తవలస, వేపాడ, డెంకాడ, భోగాపురం, సంతకవిటి మండలాలు జీఈఆర్‌లో నూటికి నూరు శాతం లక్ష్యాన్ని చేరుకున్నాయి. ఈ ఆరు మండలాల్లో ఏ ఒక్కరూ చదువుకు దూరంగా లేనట్లయింది.

కోరిన విద్యాలయాలల్లో చేర్పించాం



జిల్లాలో నూరు శాతం జీఈఆర్ సాధించే దిశగా క్షేత్రస్థాయిలో సిబ్బంది పనిచేస్తున్నారు. అందరి సమన్వయంతో ఇప్పటి వరకు ఆరు మండలాల్లో శతశాతం పూర్తయింది. మరో 10 మండలాలు 99 శాతం నమోదు చేసి శతశాతానికి చేరువులో ఉన్నాయి. పిల్లలు, వారి తల్లిదండ్రులు కోరుకున్న విద్యాసంస్థలో చేర్పిస్తున్నాం. – బి.లింగేశ్వరరెడ్డి, డీఈఓ

10 మండలాల్లో 99 శాతం దాటి నమోదు

జిల్లాలో ఉన్న 27 మండలాలు, నాలుగు అర్బన్ ప్రాంతాల్లో విద్యార్థుల జీఈఆర్ నమోదు 99 శాతం పూర్తిచేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 10,761 వలంటీర్లలో 512 మంది మినహా 10,249 మంది వారి పరిధిలో జీఈఆర్ నమోదు శతశాతం పూర్తి చేసుకున్నారు. మెరకముడిదాం మండలంలో అత్యల్పంగా 62.13 శాతం జీఈఆర్ నమోదు జరిగింది. నెల్లిమర్ల అర్బన్‌లో 68.80 శాతం, వంగర మండలంలో 74.19 శాతం, నెల్లిమర్ల మండలంలో 76.19 శాతం, గరివిడి మండలంలో 88.46 శాతం, రేగిడి అముదాలవలస మండలంలో 89.77 శాతం మాత్రమే జీఈఆర్ నమోదయింది. మిగిలిన అన్ని మండలాల్లో 90 శాతం దాటి శతశాతం పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నాయి.

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలి

- ఏపీ ప్రకృతి వ్యవసాయం ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్



కలెక్టర్ నాగలక్ష్మితో భేటీ అయిన విజయ్‌కుమార్



అధికారులతో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

విజయనగరం ఫోర్ట్: జిల్లా అంతటా ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలని ఏపీ ప్రకృతి వ్యవసాయం ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి. విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయ విస్తరణకు రైతులను శాస్త్రవేత్తలుగా రుపొందించేందుకు ప్రణాళిక తయారు చేయాలని కోరారు. జిల్లా పర్యటనకు శుక్రవారం వచ్చిన ఆయన ముందుగా కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ ఆశోక్‌తో భేటీ అయ్యారు. జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న ప్రకృతి వ్యవసాయం, దాని విస్తరణ అవకాశాలపై చర్చించారు. అనంతరం కలెక్టర్ సమావేశ మందిరంలో వ్యవసాయ అధికారులు, మోడల్ మేకర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో శతశాతం ప్రకృతి వ్యవసాయం చేసేదిశగా కృషి చేయాలని కోరారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న విద్యావంతులైన రైతులను ఎంపిక, చేసి పులివెందులలో నాలుగేళ్ల పాటు శిక్షణ ఇప్పించి రైతు శాస్త్రవేత్తగా తయారు చేయాలని సూచించారు. జిల్లాలో వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ ప్రణాళికను మార్చాల్సి ఉందని చెప్పారు. వర్షాలకు అనుగుణంగా పంటల ప్రణాళికను మార్పు చేయాలని, ప్రకృతి సేద్యాన్ని కేవలం వ్యవసాయానికే పరిమితం చేయకుండా, మత్స్య సాగు లాంటి ప్రత్యామ్నాయ మార్గాలను కూడా ప్రోత్సహించాలని చెప్పారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వి. తారకరామారావు, ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా మేనేజర్ ఆనందరావు, ఎ.డి ప్రకాశరావు, హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

11న జిల్లా స్థాయి యువజనోత్సవాలు

పార్వతీపురంటౌన్: జిల్లా స్థాయి యువజనోత్సవాలు (సాంస్కృతిక పోటీలు) ఈనెల 11న పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం పరిధిలో రాయగడ రోడ్, జట్టు ఆశ్రమంలో నిర్వహిస్తున్నట్లు సెట్విజ్ సీఈఓ బి. రామగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యువజనోత్సవాలలో భాగంగా సాంస్కృతిక విభాగంలో జానపద నృత్యాలు (బృందం), జానపద గీతాలు (బృందం), జానపద నృత్యాలు (సోలో), జానపద గీతాలు (సోలో), జీవిత నైపుణ్య విభాగంలో స్టోరీ రైటింగ్ (సోలో), పోస్టర్ మేకింగ్ (సోలో), డిక్లరేషన్ (సోలో), ఫొటోగ్రఫీ (సోలో), వన్ మినిట్ - పర్యావరణ పరిరక్షణ (సోలో), ఆరోగ్యం, శరీర దృఢత్వం విభాగంలో యోగా ప్రదర్శన (బృందం) పోటీలు నిర్వహించనున్నామన్నారు. ఈ పోటీలలో 15-29 సంవత్సరాల మధ్య వయస్సున్న యువతీయువకులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారు రాష్ట్రస్థాయి యువజనోత్సవాలలో పాల్గొనేందుకు అర్హులవుతారని, రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారు జాతీయ స్థాయి యువజనోత్సవాలలో పాల్గొంటారన్నారు. జిల్లా స్థాయి యువజనోత్సవాలలో పాల్గొనదలచిన వారు ముఖ్యకార్య నిర్వహణాధికారి, సెట్విజ్, కంటోన్మెంట్, విజయనగరం కార్యాలయయానికి నేరుగా గాని లేదా సెట్విజ్ ఎట్‌ద రేట్ ఆఫ్ యాహూ.కామ్/వాట్సాప్ ఫోన్ 9849199384, 8247554334 నంబర్లకు గాని ఈనెల 10వతేదీన సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు పంపాలని సూచించారు. దరఖాస్తులు మండల పరిషత్ అభివృద్ధి అధికారుల కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనే అభ్యర్థుల పేర్లు, ఇతర వివరాల నమోదు చేసుకునేందుకు మరిన్ని వివరాలకోసం ఫోన్9849199384, 8247554334 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ట్రాఫిక్ ఎస్సై చొరవతో తప్పిన ప్రమాదం



ప్రమాదానికి గురైన అరబిందో బస్సు

విజయనగరం క్రైమ్: ట్రాఫిక్ ఎస్సై ఎం.రాజు చొరవతో సిబ్బంది సమయానుకూలంగా స్పందించడంతో ప్రైవేట్ కంపెనీ బస్సులో ఉన్న ఉద్యోగులకు ప్రమాదం తప్పింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. అరబిందో కంపెనీకి సంబంధించిన బస్సు విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద శుక్రవారం తమ కంపెనీ ఉద్యోగులను తీసుకుని వెళ్తుండగా ఇంజిన్‌లో సాంకేతిక లోపం కారణంగా పొగలు, మంటలు వచ్చాయి. దీంతో అక్కడ ట్రాఫిక్ రెగ్యులేషన్ విధులు నిర్వహిస్తున్న ఎస్సై, సిబ్బంది చొరవ తీసుకుని ఆటోడ్రైవర్స్ సహకారంతో బస్సులో ఉన్న ఉద్యోగులను సురక్షితంగా కిందికి దింపి, ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేశారు. అనంతరం రహదారి మధ్యలో ఆగిన బస్సును ఆటోడ్రైవర్ల సహకారంతో పక్కకు తొలగించి, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు. ఈ చర్యతో ట్రాఫిక్ ఎస్సై రాజును స్థానికులు, సిబ్బంది అభినందించారు.

25 నుంచి వ్యవసాయ కార్మిక మహాసభలు



కరపత్రాన్ని విడుదల చేస్తున్న యూనియన్ నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: ఈనెల 25 నుంచి 27 వరకు బాపట్లలో జరిగే 22వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయు) జిల్లా ప్రధాన కార్యదర్శి పురం అప్పారావు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక అమర్ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికీ గ్రామీణ ప్రజల్లో అత్యధిక మంది వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్నారన్నారు. వారిలో ఎక్కువ మంది గిరిజనులు, దళితులు ,వెనుకబడిన కులాల వారు ఉన్నారని, వారికి నేటికీ అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. భూస్వామ్య పెత్తందారీ దోపిడీ నుంచి విముక్తి కోసం 90 సంవత్సరాల క్రితమే వ్యవసాయ కూలీ సంఘం ఆవిర్భవించిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు అలమండ ఆనందరావు నెల్లిమర్ల, గంట్యాడ మండలాల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి.గౌరి నాయుడు, కాళ్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ కృషి అభినందనీయం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు, ఆర్డీఓ హేమలత

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కృషి అభినందనీయమని ఎమ్మెల్యే జోగారావు ప్రశంసించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఇటీవల పార్వతీపురం ప్రాంతంలో కురిసిన కుంభవృష్టికి నీట మునిగిన పలు లోతట్టు ప్రాంతాల ప్రజల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లగా తక్షణమే స్పందించారని చెప్పారు. ఈ మేరకు రాష్ట్ర విపత్తుల శాఖకు నివేదించి అత్యవసరంగా నిధులు మంజూరు చేయిస్తూ ప్రత్యేక ప్రభుత్వ ఉత్తర్వులను విడుదల చేయించడమే కాకుండా పురపాలక సంఘంలో బాధితులకు నిత్యావసర సరుకుల 25 కేజీల బియ్యం, ఆయిల్ ప్యాకెట్, ఉల్లిపాయలు, రూ.2 వేలు ఆర్థిక సహాయాన్ని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అందజేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, మున్సిపల్ కమిషనర్ రామప్పల నాయుడు, తహసీల్దార్ శివన్నారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

24గంటల వ్యవధిలోనే సహాయం

వరద బాధితులకు 24 గంటల్లోనే సహాయం అందజేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. 25కేజీల బియ్యం, ఆయిల్ ప్యాకెట్లు, ఉల్లిపాయలు, రూ.2వేల నగదు, బంగాళదుంపలు, కందిపప్పును ఎమ్మెల్యే జోగారావు, ఆర్డీఓ కె. హేమలతలు బాధితులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరద బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, అందులో భాగంగా అత్యవసర సహాయంగా నిత్యావసర సరుకులు, ఆర్థిక సహాయాన్ని అందించినట్లు చెప్పారు. పార్వతీపురం ప్రాంతం భవిష్యత్‌లో ముంపు బారిన పడకుమా శాశ్వత చర్యలు చేపట్టేందుకు కృషిచేయనున్నట్లు తెలిపారు.

రహదారులపై అక్రమ కట్టడాలను తొలగించాలి

పార్వతీపురం: రహదారులపై అక్రమ కట్టడాలను తొలగించాలని కోరుతూ పార్వతీపురం మన్యం జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకట్రావుకు సీపీఐ జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సాలూరు, పాలకొండ పట్టణాల్లోని రహదారులపై అక్రమ కట్టడాలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని తక్షణమే తొలగించాలని కోరారు. అక్రమ కట్టడాల వల్ల వర్షాలు కురిస్తే రహదారులు చెరువుల్లా మారుతున్నాయని పేర్కొన్నారు.

జ్ఞాన భూమిలో వివరాలు పొందుపరచాలి

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో కళాశాల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్స్ కళాశాల లాగిన్‌లో 2023-24 విద్యాసంవత్సరానికి కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల పూర్తి వివరాలను పునరుద్ధరణ చేసుకునేందుకు జ్ఞానభూమి పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమం, సాధికారత శాఖాధికారి మహమ్మద్ గయాజుద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సుల వారీగా 2017-18 నుంచి 2021-22 విద్యాసంవత్సరం వరకు కళాశాల విద్య పనితీరు పొందుపరచాలన్నారు. పునరుద్దరణ చేసుకునేందుకు ఈనెల 10వ తేదీ వరకు కళాశాలలకు అవకాశం కల్పించినట్లు ప్రకటనలో తెలిపారు.

కేటరింగ్ టెక్నాలజీ అండ్ అప్లైడ్ న్యూట్రిషన్‌లో శిక్షణ

పార్వతీపురం: కేటరింగ్ టెక్నాలజీ అండ్ అప్లైడ్ న్యూట్రిషన్‌లో ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు తిరుపతి స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజిమెంట్ కేటరింగ్ టెక్నాలజీ అండ్ అప్లైడ్ న్యూట్రిషన్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రమణ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతిలోని జూపార్క్ వద్ద ఉన్న భారత పర్యాటక శాఖ, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖలతో సంయుక్తంగా ఈ శిక్షణ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియట్, ఐటీఐ ఉత్తీర్ణులై 18 నుంచి 28 సంవత్సరాల వయస్సు కలిగిన యువత దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత భోజనం , వసతి కల్పించనున్నారని పేర్కొన్నారు. ఈ నెల 15లోగా హెచ్‌టీటీపీఎస్://ఆర్‌బీ.జీవై/6జేయూడీఎస్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకోసం ఫోన్ 9160912690, 9100558006, 9032697478 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కళాశాల హాస్టల్‌లో విద్యార్థిని ఆత్మహత్య

చీపురుపల్లిరూరల్: చీపురుపల్లి మండలంలోని కరకాం గ్రామానికి చెందిన విద్యార్థిని మీసాల రమ్య (16) విశాఖలోని బోయపాలెంలో గల ఓ ప్రైవేట్ కళాశాల హాస్టల్‌లో ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామస్తులు తెలిపిన సమాచారం మేరకు విద్యార్థిని రమ్య కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. వేలాది రూపాయలు కళాశాల ఫీజులు చెల్లిస్తున్నా కష్టపడి చదవలేకపోతున్నానని మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడింది.

పురుగుమందు తాగి వ్యక్తి...

మక్కువ: మండలంలోని శంబర గ్రామానికి చెందిన తీళ్ల భాస్కరరావు (50) గురువారం పురుగుమందు తాగి ఆత్యహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. భాస్కరరావు కొంతకాలంగా మద్యానికి బానిసై, కుటుంబాన్ని సరిగా చూసుకోకపోవడంతో భార్య గౌరమ్మ మందలించింది. దీంతో మనస్తాపానికి గురై పురుగు మందుతాగేశాడు. ఈ విషయం గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన శంబర పీహెచ్‌సీకి తరలించి, వైద్యసేవలు అందించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం సాలూరు సీహెచ్‌సీకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వివాహిత..

కురుపాం: మండలంలోని గుమ్మిడిగూడ పంచాయతీ గుజ్జుపాడు గిరిజన గ్రామానికి చెందిన వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటనపై కురుపాం ఎస్సై సీహెచ్ ప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బిడ్డిక కళావతి కుటుంబ కలహాలతో ఈ నెల 3వ తేదీన క్రిమిసంహార మందు తాగేసింది. ఈ విషయం గమనించిన బంధువులు కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురాగా చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం 4వ తేదీన పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మూడు రోజుల పాటు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె మృతి చెందింది. ఈ మేరకు పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



మాట్లాడుతున్న జిల్లా ఉపాధి అధికారిణి డి.అరుణ

విజయనగరం అర్బన్: జిల్లా ఉపాధి కార్యాలయం, ప్రభుత్వ ఐటీఐ సంయుక్త నిర్వహణలో స్థానికంగా శుక్రవారం జరిగిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. డెక్కన్ ఫైన్ కెమికల్స్, అరబిందో ఫార్మా యూనిట్-14, ఎస్‌బీఐ కార్డు సంస్థ, యూనియన్ బ్యాంక్ కార్డ్స్ (టీమ్ లీజ్) సంస్థలు పాల్గొన్న జాబ్ మేళాకు జిల్లా వ్యాప్తంగా 228 మంది హాజరయ్యారు. వారిలో 72 మందిని తదుపరి రౌండ్‌కు ఎంపికయ్యారని జిల్లా ఉపాధి అధికారిణి డి.అరుణ తెలిపారు. జాబ్‌మేళా నిర్వహణలో ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ టి.గిరి, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఎస్.గోవిందరావు, సంస్థల హెచ్ఆర్ ఎల్.సంతోష్, దీపికా, ఎం.యశ్వంత్‌బాబు, జిల్లా ఉపాధి కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరంలో జగనన్నకు చెబుదాం



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్ కుమార్



కార్యక్రమానికి వచ్చిన అర్జీదారులు

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడానికి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం దోహద పడుతుందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ అన్నారు, ఈ మేరకు ఆయన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని శుక్రవారం సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల స్థాయిలో మొట్టమొదటిసారిగా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని సీతానగరం మండలంలో నిర్వహించడం, జిల్లా అధికారులంతా హాజరుకావడంతో ప్రజలనుంచి అనూహ్యమైన స్పందన రావడం శుభపరిణామమన్నారు. కలెక్టర్ స్థాయిలో మండలాల్లో నిర్వహిస్తున్న మొట్టమొదటి జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించిందని సంతృప్తి వ్యక్తం చేశారు. మండల ప్రజలు వ్యక్తిగత, సామాజిక సమస్యలపై 80 వినతులు సమర్పించగా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవింద రావు, రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత స్వీకరించారు.

త్వరితగతిన పరిష్కారమే ధ్యేయం

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో సమర్పించిన ఆర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపడమే ధ్యేయమని కలెక్టర్ నిషాంత్ కుమార్ అన్నారు. మండల స్థాయి సమస్యలు మండలంలోనే పరిష్కారం కావాలన్నది ప్రభుత్వం అభిమతమని వివరించారు. మండలాల్లో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమం షెడ్యూల్ విడుదల చేశామని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ బి. జగన్నాథ రావు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్ కుమార్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామచంద్రరావు, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా ఉద్యాన అధికారి కేవీఎస్ఎన్ రెడ్డి, జిల్లా సహకార అధికారి సన్యాసినాయుడు, జిల్లా మత్స్య శాఖ అధికారి వి. తిరుపతయ్య, జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె. విజయగౌరి, జిల్లా ప్రణాళిక అధికారి పి. వీర రాజు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి ఎస్.కృష్ణ, జిల్లా కార్మిక శాఖ అధికారి కె. రామకృష్ణా రావు, ఆర్ అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారి ఎం.జేమ్స్ పాల్గొన్నారు.